తన కూతురితో
వివాహానికి అతని
స్నేహితుడ్నిరావొప్పించ
మంటూ వచ్చిన
ఆ ముసలాయనికి
అతనేం చెప్పాడు?

# శివల జగన్నాథరావు కథ

# ఘనకార్యం

రామావతారం ఎండలో రోడ్డుమీద బస్సు కోసం ఎదురుచూస్తూ నిల్చున్నాడు. ఎండ ఎక్కువగా వుంది. అతనికి చాలా చికాగ్గా, అసహనంగా వుంది.

ఆనందు ఆ వుత్తరం రాయకపోతే, తనిప్పుడు ఊరినించి వాడి ఊరికి వెళ్ళవలసిన అవసరం లేదు. అర్జెంటుగా రమ్మని రాసాడు!

ఆనందు ఎప్పటిలాగే "నువ్వు కులాసా అని తలుస్తాను. నేను ఫరవాలేదులే! ఏదో బాగానే వున్నానులే" అంటూ రాసాడు!!

వాడి ఉత్తరాలలో మొదటి వాక్యాలు అలాగే వుంటాయి!!

అలా వ్రాస్తాడేమిటి, ఆనందు?!!

ఏదో అసంతృప్తి, ఏదో లోటు వాడి మాటల్లో వ్యక్తం అవుతోంది!

ఏదో అయింది ఆనందుకి!!

పెళ్ళయిందిగదా. ఈ మధ్య? భార్య రాక్షసి అయి వుంటుంది!

వాణ్ణి కాల్చుకు తింటోందేమో?! రోజుకో తగువు, పోరుపెట్టి చంపేస్తోందేమో! పాపం! ఆనందుని తల్చుకుంటే తనకి జాలి వేస్తోంది!

"ఎవరికెంత రాసిపెట్టి వుంటుందో, అంతకంటే దక్కదుగదా!" అని కూడా ఆనందు వ్రాసాడు!

ఖచ్చితంగా వాడికి జీవితంలో సౌఖ్యం లేదు అని తెలిసి పోతోంది!! అయినా ఈ కాలం ఆడపిల్లలు చాలా గడుగ్గాయిలు!! అనుకున్నాడు రామావతారం.

బస్సు వచ్చేసింది.

సీటు దొరకడం కొంతసేపు కష్టం



అయింది.

రామావతారం విసుక్కున్నాడు. జనాభా చాలా ఎక్కువయిపోతోందని తిట్టుకున్నాడు. ప్రభుత్వం ఎందరికో **ఫామిలీ ప్లానింగ్** చేయించినా, ఎలా వచ్చేస్తున్నారో ఈ జనాలు!!!

కొంతసేపు నిలబడీ, సీటు దొరికాక చతికిలబడి ఎలాగో తంటాలుపడితే తనక్కా

వలసిన ఊరు చేర్చిందా బస్సు.

ఆనందు బస్టాండుకి వచ్చి స్నేహితుడిని రిసీవ్ చేసుకున్నాడు. రామావతారం వాడిని చూస్తూ కాస్సేపలా వుండిపోయాడు.

బలహీనంగా వున్నాడు ఆనందు!!

ముఖంలో కళా, కాంతీ లేవు!!

"ఒరే మనం కలుసుకొని ఎంతకాలం అయిందిరా?" అని ఆనందు అడిగాడు.

"ఎక్కడరా? ఎనిమిది సంవత్సరాలవడంలేదూ?" అన్నాడు రామావతారం.

ఇద్దరూ ఎనిమిదవ క్లాసునించీ, టీకావ్స్ ఫైనల్‌దాకా కలిసి చదివేరు. ఆ తరువాత ఆనందు తండ్రికి ఉద్యోగార్థం మరో ఊరికి వాళ్ళు వెళ్లిపోవలసి వచ్చింది. అక్కడే ఆనందుకి ఒక ఫర్మ్‌లో క్లర్క్ జాబ్ వచ్చింది.

రామావతారం డిగ్రీ అయాక రికమండేషన్లు, వగయిరా సాయంతో ఓ గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగం సంపాదించుకున్నాడు.

మిత్రులిద్దరూ దూరంగా వున్నా పదిరోజులకో ఉత్తరమైనా అటూ ఇటూ ఇద్దరినీ కలుపుతూ వుండేది.

ఆనందుకి వివాహం కుదిరిందని ఉత్తరం రాగానే రామావతారం ఆఘమేఘాలమీదే ఆ ఊరికి వెళ్ళాడు.

"ఏవిట్రా ఆనందూ? ఎవరాపిల్ల? ఎలా వుంటుంది? చాలా అందంగా వుంటుందా? లేకపోతే ఆర్డినరీ అందమా? ఏమయినా చదువుకుందా? డిగ్రీనా? నీ అంత పొడుగుంటుందా? పొట్టిపిల్లా?" అని ప్రశ్నలు కురిపించాడు.

ఆనందు నవ్వి "ఏం గాభరా మనిషివిరా బాబూ! ఏమీ మారలేదు నువ్వు! పైగా మరింత సందేహాలూ, అనుమానాలు పెరిగిపోయాయి నీకు!!" అని ఫోటో చూపించాడు.

ఫోటోలో అమ్మాయిని చూసీ నువ్వు పెళ్ళికి ఒప్పేసుకొన్నావా?" అడిగాడు రామావతారం.

"ఏం?"

"ఫోటోకీ, పైన మనిషికీ తేడా వుంటుందిరా బాబూ!"

"అబ్బ! నేను ఆ అమ్మాయిని చూసాను! మాటలు, చూపులూ అయిపోయాయి తెలుసా?"

రామావతారం బుర్ర గోక్కుని "ఇంతకీ కట్నం ఎంతటా?" అడిగాడు.

చెప్పాడు ఆనందం.

"ఓస్! ఇంతేనా? చాలా అవమానంరా ఇది నీకు! నువ్వే అంత తక్కువ అడిగావా?"

"అవును! వాళ్ళని డిమాండ్ చేసి బాధ పెట్టకూడదని..."

"ఛా! పో!" కసిరాడు రామావతారం.

"చూడు! ఎంత తక్కువ కట్నం అడిగితే, ఆ అబ్బాయిని అంత చులకనగా, తేలికగా అంచనా వేస్తారు ఆడపిల్లవాళ్ళు!! తెల్సా? అస్సలు కట్నం అక్కర్లేదన్నావనుకో! అయితే వీడికి ఏదో లోపం వుందని అనుకుంటారు!!"

"అబ్బా! నీతో ఛస్తున్నారా!" విసుక్కున్నాడు ఆనందు.

స్నేహితుడు ఎంత ఒత్తిడి చేసినా

ఆనందు కట్నంకి వాళ్ళని ఒత్తిడి చేయలేదు.

''సరేలే! నీ ఖర్మ పో!'' అన్నాడు రామావతారం.

ఆనందు పెళ్ళయింది.

అప్పుడు వాళ్ళు కలుసుకోవడమే.

ఆ తరవాత మళ్ళా ఇప్పుడే కలుసుకున్నారు.

రామావతారం బాధపడుతూ ''నేననుకుంటూనే వున్నాలే! అదే నిజం అయింది! నువ్వు కట్నం మీరెంతిస్తే అంతే ఇవ్వండన్నావు!! వాళ్ళు 'ఓహో! వీడు మనకి లొంగిపోయ్యాడా! మనం ఎలా ఆడిస్తే అలా ఆడతాడు!' అనుకున్నారు!! నీ పెళ్ళాం నిన్ను కాల్చుకు తింటోందవునా? నీ ఖర్మలే! చేసుకున్న బ్రామ్మడా! అనుభవించు!'' అన్నాడు.


ఆనందు చిరునవ్వు నవ్వి కొంతసేపు మౌనంగా వుండిపోయాడు.

ఇద్దరూ ఆనందు ఇంటికి వెళ్ళారు. మూడు గదుల డాబా ఇల్లు అది! ముచ్చటగా కనిపిస్తోంది!

వెళ్ళగానే ఒక గది వుంది. ఆ గదిలో సోఫా, రెండు కుర్చీలు, టేబిలుమీద టీవీ, పైన సీలింగ్ ఫాను లాంటి హంగామా వుంది. ఆ గదిని అనుకొని పక్క గది వుంది! ఆ గదికి తెరవేసివుంది! ఆ గది తలుపులు కూడా దగ్గరగా చేర వేసి వున్నాయి. అందుచేత లోనికి గభాల్న వెళ్ళలేకపోయాడు రామావతారం. మరో గది వెనకది వంటిల్లు. పెరట్లో సెప్టిక్ లెట్రిను, బాత్‌రూము వున్నాయి.

రామావతారం ఆశ్చర్యపోతూ ''ఇదేంట్రా? ఇల్లింత నిశ్శబ్దంగా వుందేమిటి? నువ్వు ఒక్కడివే వుంటున్నావా? మీ ఆవిడ? ఆ గదిలో ఎవరయినా వున్నారా? మీ బెడ్రూములో? లేక ఆవిడ పుట్టింటికిగాని వెళ్ళిందా? అయితే నువ్వు మీ ఫాదరూ వాళ్ళతో కల్సి లేవన్నమాట?'' అన్నాడు.

''వాళ్ళా, నా ఫామిలీ దూరంగానే



వుంటున్నాం! సంవత్సరంనర పైనే అవుతోంది. మా నాన్నవాళ్ళతో వేరుపడి!!'' అని చెప్పాడు ఆనందు.

''నేననుకున్నాలే! మీ ఆవిడ వచ్చిందంటే అత్తవారివి దూరంగా వెట్టేస్తుందనీ అలాగే అయిందన్నమాట!'' అన్నాడు రామావతారం.

''అలానా? ఇంకా ఏం అనుకున్నావు?'' అడిగాడు ఆనందు గంభీరంగా చూస్తూ.

రామావతారం కాస్సేపు మాట్లాడలేదు.

ఆ గోడల్నీ, ఫర్నిచర్నీ, గోడకి తగిలించి వున్న ఆనందు భార్యా వున్న ఫోటోనీ చూడసాగాడు.

''ఒరే! ఆ గదిలో...'' అన్నాడు ఆగి.

''నా భార్య... నిద్రపోతోంది'' అని చెప్పాడు ఆనందు.

''ఇప్పుడా నిద్ర? పగలా? ఏవయినా అనారోగ్యం చేసిందా?''

''ఊఁ... బాగోలేదు ఒంట్లో''

రామావతారం స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు.

ఆనందే తనకి కాఫీ చేసివ్వడం ఆశ్చర్యం కలిగించింది రామావతారానికి. అంత లేవలేకుండా వుందా వాడి భార్య?

''అంత ఏమిటి బాగోలేదు ఆవిడకి? మంచం దిగలేనంత?'' అనడిగాడు ఆత్రంగా.

ఆనందు గంభీరంగానే వున్నాడింకా.

''అస్సలు బాగోలేదులే! అది సరేగానీ...'' అని ఆగి—

''ఇంతకూ నేను నిన్ను అర్జెంటుగా ఎందుకు రమ్మన్నానో, నన్ను అడిగావా?'' అన్నాడు.

''నాకు తెలుసులే! ఉత్తరాల్లో వూ తెగ దంచుతున్నావు గదా? నన్ను వేగరం పెళ్ళి చేస్కోమంటూ!! లేకపోతే వయసు పెరిగిపోతుంది అంటూ!! ఏదో సంబంధం చూసి వుంటావు అవునా?''

''ఓహో! అయితే నీకిప్పటికి పెళ్ళిమీద తిరిగిందన్నమాట? అందుకే వెంటనే వచ్చేశావు!''

రామావతారం ''చాల్లే'' అని కసిరాడు.

''చేసుకున్నవాళ్ళంతా ఏం సుఖపడిఛస్తున్నారని?''

''అదేంమాటరా? నూటికీ అరవైమందైనా ఆనందం అనుభవించడం లేదంటావా, అయితేమూ?''

''ఏమో! ఆ మిగిలిన నలభైమందిలో నీలాగే నేనూ జమ అయిపోతానేమో అని భయం...''

''ఛా పోరా! వెధవనుమానాలూ నువ్వూనూ! ఇదిగో! త్వరగా ముస్తాబవు!! మనిద్దరం వాళ్ళింటికి వెళదాం!'' అని చెప్పాడు ఆనందు.

రామావతారం స్నేహితుణ్ణి అదోలా చూసి ''ఇవాళే నన్ను వాళ్ళక చూపిస్తానని చెప్పేసేవా?'' అనడిగాడు.

''ఆ... చెప్పేశాను! అంటే... నువ్వు ఎప్పుడు వస్తే అప్పుడే నిన్ను వాళ్ళింటికి తీసుకువస్తానని చెప్పాను!!''

''ఛంపేసేవ్‌రా! అలా ఎందుకు చెప్పావ్?''

''ఏం? చెప్తే ఏం?''

"అలా చెప్పకూడదురా బాబూ! వాళ్ళు ఆడ పెళ్ళివారు! మనం మొగపెళ్ళివారం!! మనం కాస్త బెట్టుసరిగా వుండాల్రా నాయినా!"

"అబ్బ! ఏం మొగగొప్పరా నాయినా నీకూ?"

"నీ మొహం! నీకేం తెలీదు!! ఏ పాయింటులోనూ మనం వాళ్ళకి దొరికిపోకూడదు!! అయినా మనంతట మనమే వెళ్ళటం ఏంటి? వాళ్ళు రావాలి! ఎవరయినా వచ్చి, తీసుకెళ్ళాలి!"

"వాళ్ళు రాకపోతే, నువు రావా?" విసుగ్గా అడిగాడు ఆనందు.

"ఊహు! చులకనైపోతాను!"

"నీ బొందలే! పద! నేరకపోయి ఉత్తరం వ్రాసేము! వాళ్ళు "ఎవరైనావున్నారా? వున్నారా?" అవి తెగ అడిగితే, ఏం చెయ్యను? నీ గురించి చెప్పాను!!"

రామావతారం వెంటనే చురుగ్గా చూసాడు.

"ఏమి తెగ అడిగారావాళ్ళు? చాలా ఆత్రంతో ఆరాటంతోనా?" అడిగాడు.

"ఆ ఆత్రంగానే అడగారు! ఆడపిల్ల వాళ్ళుగదా? ఆ ఆరాటం సహజం!"

"నీ మొహం! వాళ్ళంత ఆరాటపడిపోతున్నారంటే ఏదో వుందన్నమాట?! ఆ పిల్ల పెళ్ళి గురించి. అంత ఆందోళనెందుకు వాళ్ళకి, ఏమీ లేకపోతే?" అన్నాడు రామావతారం.

కోపంతో మాట రాలేదు ఆనందుకి.

చురచురా చూసాడు.

"ఆ పిల్ల ఏదో తొందరపడి వుంటుంది! నేను వూహించగలనులే! ఏ వెధవపని చేసిందో? అది కవరు చేస్కోందికి వాళ్ళు తొందరగా ఈ పెళ్ళి తలపెట్టారన్నమాట?"

ఆనందు చేతులు రెండూ జోడించాడు.

"నాయనా! నీకో నమస్కారం" అన్నాడు.



## గాడిద

గడ్డిమోపు నెత్తిన పెట్టుకుని వయ్యారంగా నడిచి వెళ్తోన్న పల్లెపడుచుని ఫాలో అవుతూ కొంటెగా అడిగాడు ఓ పట్నం షోకిల్లా—

"గడ్డి మీ అయ్యగారి పశువులకేనా?"

"కాదు నా వెంటపడ్డ గాడిదకోసం!" ఠక్కున జవాబిచ్చి విసవిసా నడిచింది పల్లెపడుచు.

—అమర్ కుమార్, హైదరాబాద్

రామావతారం గర్వంగా నవ్వాడు.

"ఈ రామావతారం అంటే ఏవిటనుకు న్నావ్ మనం భూత, వర్తమాన, భవిష్యత్ లు అన్నీ కరెక్టుగా చెప్పేయగలం తెల్సా?"

"అయితే అన్నీ నువ్వే చెప్పేసుకో!! ఊరికెళ్ళిపో!" అన్నాడు ఆనందు.

"అలాకాదులే! పద వెళదాం పోనీ! ఎలానూ ఇంత దూరం వచ్చేనుగదా?" అని నడిచాడు రామావతారం.

అప్పుడు చీకటి పడిపోయింది. వెలుగు పూర్తిగాపోయి వీధుల్లో దీపాలు దేదీప్యమాన ంగా వెలుగుతున్నాయి.

దోవలో రామావతారం గొణిగాడు. "రేప్పొద్దున్న వెళ్ళవల్సింది! రాత్రివేళ వెళితే ... ఆ పిల్ల ఎలావుందో సరిగ్గా నాకు తెలీదుగదా?"

"ఏం? నీకు సైటు వచ్చిందా? కళ్ళద్దా లు పెట్టుకోలేదేం మరి?" అని అడిగాడు ఆనందు.

రామావతారం విసుక్కున్నాడు. "అబ్బ ! అది కాదురా! నాకే సైటూ లేదు! రాత్రివేళ లైట్ల వెలుతుర్లో ఎలావున్నా అమ్మాయేనాసరే మేకప్ కొడ్తే అప్సరసలా కనిపిస్తుందిలే!! ఇప్పుడు మాసి ఒప్పేసుకుం టే తర్వాత విచారించాలనీ!!..."

మరో దండం పెట్టాడు ఆనందు స్నేహితుడికి.

"ఒరే ఇలా దండాలుపెట్టొద్దు! నాకు అవమానంగా వుంది" అన్నాడు రామావతా రం.

"అదిగోరా! ఆ మేడే వాళ్ళది!" చెప్పా డు ఆనందు.

"అమ్మో! రెండంతస్తుల మేడన్నమాట వాళ్ళది?! స్వంత మేడేనా? లేకపోతే మేడలో అద్దెకుంటున్నారా?"

"వాళ్ళ మేడే!"

"అయితే ధనవంతులే!"

"ఆ... గోదావరి జిల్లాలో పొలాలున్నా య్! ఇంకా రెండు మిల్లులున్నాయ్! ఎక్కడో షేర్లున్నయ్!..."

"బావుంది బావుంది!" అన్నాడు రా మావతారం.

"అంతేకాదురా! ఆయన అంటే పెళ్ళి కూతురి తండ్రి ఒక తెలుగు సినిమా కూడా తీద్దామనే ప్రయత్నంలో వున్నాడు..." అని చెప్పాడు ఆనందు.

"అలానా? ఒకవేళ ఆ సినిమా అట్టర్ ఫ్లాఫ్ అవుతే?"

"వ్హోరి రాస్కేలా!" తిట్టాడు ఆనందు.

"అదికాదురా! సినిమా అంటే మాట లు కాదురా! అదృష్టం బావుండాలి! ఆ ఫీల్డులో అందరితో పరిచయం వుండాలి! పలుకుబడి వుండాలి! సినిమా తెలివితేటలుం డాలి ముఖ్యంగా!! ఇంతకీ అంత ధనవంతుల యితే వాళ్ళకి ఎంత గర్వం ఉంటుందో?!"

"ఏం? నీకు గర్వం లేదా నాయినా?"

"చూడబోతే నువ్వు వాళ్ళ పక్షం వాడిలా వున్నావ్‌రోయ్!! అన్నీ వాళ్ళవేపే మాట్లాడుతున్నావ్" అన్నాడు రామావతార ం కళ్ళెగరేసి.

మేడని సమీపించారు వాళ్ళు.

వరండాలో ఒక బట్టతలాయన కనిపించి

ఆనందుని చూసి నవ్వాడు. గబగబా ముందుకి వచ్చి ఇద్దరికీ షేక్‌హాండ్‌లిచ్చాడు.

పెద్ద బుంగమీసాలు, బట్టతలా, ఆరడుగుల పర్సనాలిటీ, ఆయన రూపం చూసి రామావతారం తల పంకించాడు మౌనంగా.

లోపలికి ఆహ్వానించాడాయన.

"ఎంత వినయంగా వున్నాడో చూశావా? అతి వినయం ధూర్త లక్షణం— అన్నారు పెద్దవాళ్ళు!!" అని గొణిగాడు రామావతారం.

"ఆ సోఫాలో కూచోబాబూ!" అని చెప్పాడాయన రామావతారంతో.

"బాబూ" అని అన్నాడేమిట్రా? "అండీ" అని అనలేదూ? అంత గర్వమా మరీనీ?"

"ఊరుకోరా నాయినా! నీ అనుమానాలు మంటపెట్టా" అని ఆనందు మెల్లిగా వాళ్ళకి వినిపించకుండా తిట్టాడు.

ఆయన భార్యనని చెబుతూ ఒక లావుపాటావిడ గబగబ వచ్చిందా గదిలోకి.

"అబ్బ! ఎంత లావుగా వుందో? తల్లి అంత లావుగా వుంది అంటే కూతురు ఖచ్చితంగా లావుగానే వుండి వుంటుంది! నో క్వొశ్చెన్! నువ్వు చూసావా అమ్మాయిని?" అన్నాడు రామావతారం.

లేదని చెపాడు ఆనందు.

"వచ్చాను!" అన్నాడు రామావతారం.


"ఏం చావలేదు! నిక్షేపంలా వున్నావు!" అన్నాడు ఆనందు.

"ఇంతకూ ఏం చదివింది అమ్మాయి?"

"పదవ క్లాసు అని చెప్పారు!"

తుళ్ళిపడి చూసాడు రామావతారం, ఆ మాటకి.

"అదేంట్రా? పదవక్లాసా? అంటే? అంత చిన్న అమ్మాయా? నీకు మతిలేదా? నాకు ముప్ఫయ్యేళ్ళు దాటుతూంటే?" ఆనందు చెవిలో రామావతారం నోరు మండింది.



## పిల్లల సంపాదన

*జపాన్‌లో ఎలిమెంటరీ స్కూళ్ళలో చదివే పిల్లలకు కూడా కొంత ఆదాయం వుంటుంది. వారికి ఎలవెన్సులు, క్యాష్ ఎవార్డ్స్ రూపంలో ఆదాయం వుంటుంది. ఎలిమెంటరీ స్కూలు పిల్లలు ఏటా 288 డాలర్లు సంపాదిస్తారు! ఈ డబ్బుతో 96 శాతం మంది పిల్లలు ఇంట్లో వ్రాసుకొనేందుకు స్వంత డెస్కులు, 70 శాతం మంది రిస్ట్‌వాచ్‌లు, 67 శాతం మంది వీడియో గేమ్స్ కొనుక్కొంటారు. జూనియర్ హైస్కూల్ పిల్లలకు 591 డాలర్లు, సీనియర్ హైస్కూల్ పిల్లలకు 1267 డాలర్లు ఆదాయం వుంటుందని జపాన్‌కు చెందిన టోకై బ్యాంక్ అంటోంది! సీనియర్ హైస్కూల్ పిల్లలు పార్ట్‌టైం జాబ్‌లు కూడా చేయటం విశేషం! అలా చిన్నతనం నుంచి కష్టపడటం నేర్చుకొంటున్నారు కాబట్టే... జపాన్ అంత అభివృద్ధిలోకి వచ్చింది!*

—జూపిటర్

ఆనందు ఒకసారి అటు ఇటు చూసాడు

స్నేహితుడికి దగ్గరగాజరిగి— "పిచ్చిగా వాగకు! నాకంత బుర్ర లేదనుకున్నావా? ఆ అమ్మాయికి ఇరవై అయిదేళ్ళని వాళ్ళు చెప్పారు తెల్సా?" అన్నాడు.

"వాళ్ళు ఎంతేనా చెప్తార్లే! పెళ్ళయిపోవడానికి..."

"అంటే? ఏవిటి నీ మాట?"

"నువ్వా పిల్లని చూడకుండా వాళ్ళని సమర్థించకు!! నాతో అన్ని సంవత్సరాలు కల్సి చదివిన వెధవ్వి!! నాతో అంత స్నేహం వున్నవాడివి! నా మాట ఆడకుండా వాళ్ళెవరో, వాళ్ళమాట ఆడతావేవిటి??"

నువ్వసలు నోరు మూస్కుని కూచోముందు!!"

రామావతారం నోరు మూసుకోలేదు.

"అసలింతకీ పదవక్లాసుతో చదువెందుకు ఆపేసిందిటా? తర్వాతెందుకు చదవలేదూ? చదువు రాలేదా ఇంక? మొద్దావతారవా?"

"అబ్బా! అదేంకాదు! ఏదో అవాంతరం ఒచ్చి వుంటుంది!"

"ఆ దటీజ్ వాటైవాంట్!!... ఏంటా అవాంతరం? జబ్బు చేసిందా? జబ్బు మనిషా??"

"హారినీ అనుమానం మండిపోను!!"

"లేకపోతే... పదవ క్లాసంటే ఆడపిల్లకి అప్పుడే ఊదువస్తోన్న ప్రాయంగదా?!! వచ్చీరాని వయసాయె!? అలాటప్పుడే ప్రేమలో పడిపోతార్రా!! తిన్నగా వుండరు తెల్సా? రిపరిపలాడిపోతుంటారు!! ఇచ్చితంగా ఆ పిల్ల ఏదో కాని పనిచేసే వుంటుంది!! ధనవంతుల పిల్ల!! ప్రేమ తప్ప మరో సమస్య వుండదు వాళ్ళ పిల్లలకి!!"

ఆనందు స్నేహితుడినోటిని ఎలా మూయడం అని చాలా ఆరాటం పడుతున్నాడు. కాని అదేదీ ఫలించకుండా వుంది!!

రామావతారం రుమాలతో మెడ, మొహం తుడుచుకున్నాడు.

అతనికి ఎంతో అసహనంగా వున్నదక్కడ.

చాలా విసుగ్గా వుంది.

తనకి స్నేహితుడూ ఆ ఆడపెళ్ళివారూ అంతా కలిసే చాలా అన్యాయం చేసినట్టు బాధపడుతున్నాడు.

అసలక్కడినించి లేచి వెళ్ళిపోదామనివుంది అతనికి.

ఆనందుకి కూడా అలాగే వుంది.

లేచి వెళ్ళిపోదామనుకుంటున్నాడు రామావతారం బాధపడలేక.

కాని— ఇతవరకు పరిస్థితి వచ్చాక— వాళ్ళు ఏమనుకుంటారు? తాను వెళ్ళిపోతే ఏం బావుంటుంది?!

రామావతారం చెయ్యి గట్టిగా పట్టుకుని కూచున్నాడు ఆనందు.

రామావతారం కళ్ళు, ఆ ఇంటిలో, ఆ గదిలో, ప్రతీ వస్తువునీ, ప్రతి మనిషి కదలికలన్నీ నిశితంగా, జాగ్రత్తగా, మెలకువగా పరిశీలిస్తున్నాయ్.

పదవ క్లాసుతో చదువాపేసి, పాతికేళ్ళ దాకా ఇంట్లో వుందీ అంటే ఊరికే గోళ్ళు గిల్లుకుంటూ కూచుంటుందా?

ఎన్ని గ్రంథాలు నడిపిందో తల్లి?!

ఆ గొడవలు తప్పడానికే, వీళ్ళు ఎన్ని సంబంధాలు తీసుకువచ్చారో?!? అన్నీ తిరిగి పోయాయి!!

ఎందుకు తిరిగిపోవు?

వీళ్ళ 'సంగతి' తెల్సిపోయి, తిరిగిపోయాయి!!

తను దొరికిపోయాడు!!

ఇదిగో! ఈ ఆనందుగాడినిందే!!

చూడు! ఎలా ముంగిలా చూస్తున్నాడో?

రామావతారం రిస్టు వాచి చూసుకున్నాడు.

ఇంతసేపు పట్టింది, వాళ్ళా అమ్మాయిని ముస్తాబుచేసి తీసుకురావడానికి అంటే నేచురల్ బ్యూటీ– కాదన్నమాట!! అసలు ఏ అమ్మాయినయినా– నేచురల్ బ్యూటీయో? కాదో? చూడాలంటే నిద్ర లేవగానే ఆ పిల్లని చూడాలి!!

రామావతారం ఒక్కసారిగా సర్దుకు కూచున్నాడు.

తల్లి కూతురిని జాగ్రత్తగా వెయ్యి పట్టుకు తీసుకుని వచ్చింది.

అబ్బ! అమ్మాయి సిగ్గుల మొగ్గయిపోతోంది సుమా!!

మొగవాడిని... పురుషుణ్ణే ఎరగనట్టూ!!


ఎన్ని టక్కుటమారాలు పోతున్నావే తల్లీ! నీ డ్రామాకి నా జోహార్లు!

అదిగో తల్లీ, తండ్రీ దగ్గర దగ్గర చేరి! ఏదో గుసగుసలాడుకుంటున్నారు! ఏమనుకుంటున్నారు చెప్మా?

"అల్లుడు మన సంగతి కనిపెట్టేసాడు సుమా! అందుకే, అలా అనుమానం చూపులు చూస్తున్నాడు! కొంచెం దాన్ని ముఖం ఎత్తమను! అతనేదయినా అడిగితే చెప్పమను!" అని అంటున్నాడు!!

ఆవిడ "అలాగే అలాగే" అని చెప్తోంది!!

"పేరేంటి?" అని అడిగాడు రామావతారం ఆ అమ్మాయిని



"శుభలేఖ" అని సిగ్గుపడుతూ చెప్పిందా అమ్మాయి.

"చాలా బావుందిరా పేరూ!" అన్నాడు ఆనందు మెల్లిగా.

రామావతారం అదోలా అయి చూసాడు స్నేహితుణ్ణి.

"నాకేమీ బాగోలేదు" అని చెప్పాడు.

"ఒరి రాస్కేలా! ఎందుకు నీకు బాగులేదు?" ఆశ్చర్యపోయి అడిగాడు ఆనందు.

"అర్జెంటుగా మార్చేసి పెట్టిన పేరులా వుంది! అసలు పేర్లు ఇలా వుండవు!! హు! పేరు మార్చేస్తే చరిత్ర కూడా మారిపోతుందని వాళ్ళనుకుంటున్నారేమో!"

ఆనందుకి ఒళ్ళు మండిపోయింది.

"నువ్వు దానికేమీ తీసిపోవు!" అన్నాడు నిగ్రహించుకోలేక.

రామావతారం "ఎవరికి?" అడిగాడు.

ఆనందు "అటు చూడు" అని తట్టాడు.

శుభలేఖ సర్దుకుని కూర్చుని రామావతారం వైపు చిత్రంగా చూస్తోంది.

"ఏం చదివారూ?" మరో ప్రశ్నవేసాడు రామావతారం.

ఆనందుకి ఆగ్రహం తారాస్థాయి కెళ్ళిపోయింది.

"నేనిందాక చెప్పానుగదా? పదవక్లాసనీ! అంత వెధవ చావు ఛస్తూ మళ్ళా ఆ ప్రశ్నలేం? బెడ్డ వేసి లోతు చూడడానికా?" అన్నాడు.

"ఏం చదివారు? చెప్పండి? ఫర్వాలేదు..." అన్నాడు రామావతారం.

"టె... టెన్త్‌క్లాస్..."

"ఆపైన ఎందుకు చదవలేదు?"

ఆ అమ్మాయి జవాబు చెప్పలేదు.

"ఏమీ లేదు బాబూ! మా అమ్మాయికప్పుడు నలత చేస్తే, మాన్పించేసాం చదువు!'' అని ముసలాయన చెప్పాడు.

"చెప్పానా నేనూ? నా అయిడియా ఎప్పుడూ రాంగ్ అవదురా!! జబ్బు చేసి వుంటుంది! లేకపోతే మరేదో రథం తిరిగి వుంటుంది!!" అని రామావతారం నెమ్మదిగా గొణుగుతూంటే చెయ్యిమీద గిచ్చాడు ఆనందు.

"అబ్బ!" అన్నాడు రామావతారం.

"ఏవిటి బాబూ?" అడిగాడు ఆ ఇంటాయన.

"ఏం లేదండీ! మావాడికి తొందరపన్లు ఏవో వున్నాయంటున్నాడు!! నేను ఆగమంటే ఆగనంటున్నాడు..." అని చెప్పాడు ఆనందు. వాళ్ళు ఇచ్చిన కారబ్బూందీ, కాఫీ ఆనందు తీసుకున్నాడు. రామావతారం తీసుకోలేదు.

"మిమ్మల్ని ఎప్పుడు కలవమంటారు?" అడిగాడాయన.

"ఉత్తరం రాస్తాం" అని చెపాడు రామావతారం.

స్నేహితులిద్దరూ రోడ్డుమీదికి వచ్చారు.

"ఎందుకు కాఫీ టిఫినూ తీస్కోలేదు నువ్వు? వాటిమీద కూడా అనుమానమేనా?" అడిగాడు ఆనందు.

రామావతారం చిరచిరలాడాడు.

"వాళ్ళిచ్చింది తింటే వాళ్ళ మాటే ఆడతాంరా!! వాళ్ళకి లొంగిపోతాం" అని

చెప్పాడు.

"అలానా? నేను తిన్నానుగదా? నేను వాళ్ళమాట ఆడలేదేం?"

ఎందుకు ఆడడంలేదూ? నువ్వు నాతో వాళ్ళింటికి వెళ్ళకముందునించీ వాళ్ళమాటే గదా ఆడుతున్నావ్??"

"అదికాదు!! ఆ అమ్మాయి నాకు నచ్చిందనీ, నేనెందుకు చెప్పలేదు?" అనడిగాడు ఆనందు నవ్వుతూ.

రామావతారం మాట్లాడలేదు.

వాళ్ళు ఆనందు ఇల్లు చేరుకుంటుంటే ఇంటిలోంచి పెద్ద కేకలు వినిపించాయి.

అది ఆడగొంతు అవడం రామావతారాన్ని ఎంతో ఆశ్చర్యపరిచింది.

"సిగ్గూ లజ్జా లేదు బొత్తిగానూ! ఛీఛీ! మనిషన్నాక కాస్తయినా సిగ్గుండాలి!! ఎన్నివందలసార్లు చెప్పాను!! పెళ్ళాన్ని దాని ఖర్మానికి దాన్నొదిలేసి ఊరిమీద పడి తిరుగుతాడా?!! ఊరి వాళ్ళే ముఖ్యమా నేనంటే అంత గడ్డికర్రతో సమానమా?"

ఆనందు ఇబ్బందిగా మొహం పెట్టుకుని ఇంట్లో కెళ్ళాడు.

వెనకాల రామావతారం నింపాదిగా అడుగులేస్తూ వెళ్ళాడు.

"ఎవరది?" అరిచిందామె రౌద్రంగా చూసి.

"మీ బావమరిదా?"

"ఏవిటే నీమాటా?" అని కసిరాడు ఆనందు.

"నేనడిగిందానికి సమాధానం చెప్పు!? ఎవరి తమ్ముడు? ఎక్కడుందది? దాని పేరు? మాట్లాడవేం ముంగిలాగా?"

రామావతారం శిలాప్రతిమలా అయిపోయాడు.

ఏవిటి ఆవిడమాటలు?!

బొత్తిగా అంత ఘోరంగా అరుస్తుందేమిటి?!

ఆనందుని అనుమానిస్తుందేమిటి? చాలా అన్యాయం కదూ?

వాడి ప్రవృత్తి తనకి తెలియదా?!



## అదృష్టం

ప్రభాకర్‌తో బాధగా చెప్పాడు దయాకర్
"నాకు జాండీస్, డయాబటీస్, అల్సర్, టీబీ ఉన్నట్టు రిపోర్టు వచ్చాయి గురూ!"
"మరింతకీ డాక్టర్ ఏమంటున్నాడు?"
"ఇన్ని జబ్బులున్న పేషంట్ దొరకడం నా అదృష్టం అంటున్నాడు...."

—జిందం రాంమోహన్ (మౌలాలీ)

రోడ్డుమీద కూడా తలతిప్పి, ఆడపిల్ల సౌందర్యాన్ని చూడడు!!

ఒకవేళ ఈ మధ్య ఏమయినా మారాడా?!!

ఏమయినా పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడా?!!

అయినా అంత వరస్ట్‌గా తిడ్తోందేమిటి?!!

''మాధవీ!'' అని అరిచాడు ఆనందు.

అతని శరీరం ఆగ్రహంతో ఒణుకుతోంది.

''నోర్... మూస్తావా లేదా?''

మాధవి గోడవారికి పోయి వెక్కి వెక్కి ఏడుస్తోంది!!

''నేనంటే నీకిష్టంలేదు! నేనంటే నీకు ఒళ్ళంతా కుళ్ళే!!

నన్నెందుకు పెళ్ళి చేసుకున్నావ్? ఛీఛీ! నన్నెందుకిలా బాధ పెడుతున్నావ్? ఛీ! ఇలా నన్ను బాధపెట్టకపోతే చంపకూడదా?'

ఆనందు రామావతారం దగ్గరికి వచ్చి అన్నాడు.

''వింటున్నావా? అదీ దాని సంగతి!''

''ఎన్నాళ్ళనించీ ఇలాగ?'' అనడిగాడు రామావతారం.

''నా పెళ్ళయ్యేక ఆరుమాసాలు మామూలుగానే, బాగానే వుంది! ఆ తరువాత ఆరోగ్యం పాడైంది! అబార్షన్ అయింది! తరవాత పిచ్చిగా వాగడం మొదలెట్టింది!! వాగడం ఎక్కువయిపోయింది!! నా ముందే కాకుండా ఎవరు ఇంటికి వచ్చినా, ఎవరి ముందయినా ఇలాగే, నా పరువు, మర్యాద తీసేస్తుంది!! డాక్టరుకి చూపించాను! మెంటల్ కేసని అనుమానించితే, మెంటలాస్పత్రికి తీసుకువెళ్ళాను!!

''మందులు వాడినా ఏమీ ప్రయోజనం కనిపించడంలేదు! అంతా నా ఖర్మ!'' అన్నాడు ఆనందు.

''అయితే నీ ఉత్తరాల్లో నువ్వలా బాధగా వ్రాయడానికి కారణం ఇదన్నమాట?'' అన్నాడు రామావతారం.

ఆనందు ''ఊ'' అన్నాడు.

మాధవి ఊరుకోవటంలేదు.

సాధిస్తున్నట్టూ వాగుతోంది.

''ఎవర్నో తీసుకువచ్చావ్! మరోదాన్ని ఎక్కడో వుంచావ్!! దాని అన్నదమ్ముడ్ని ఇంటికూడా తెచ్చావ్! రేపు దాన్ని కూడా తెస్తావు!!''

రామావతారం స్నేహితుణ్ణి పక్కకి తీసుకువెళ్ళాడు.

''ఒరే! ఒకమాట అడుగుతాను! మరోలా అనుకోకేం?'' అన్నాడు.

''ఏమిటది?'' అన్నాడు ఆనందు.

''పెళ్ళయ్యాక నీ క్యారెక్టరు గురించీ మీ ఆవిడ అంత అనుమానంపడీ తల్లడిల్లిపోతోందంటే... నువ్వెప్పుడయినా సరదాకయినా ఏ సరసం అయినా చేసేవేమోనని, లూజుగా ప్రవర్తించేవేమోనని, నాకు అన్పిస్తోంది!!...'' అని ఆగాడు.

ఆనందు అదోలా నవ్వాడు.

''చూశావా? మాధవి గురించి నేనంతగా చెప్పినా నవ్వు నా పెళ్ళాం వేపే మాట్లాడావు!! అవును మరి!! మీ ఇద్దరిదీ ఒకటే నేచర్‌గదా? ఒకటే బుద్ధి వున్నవాళ్ళు ఒక్కలాగే మాట్లాడ్డంలో ఆశ్చర్యం

ఏముందిలే?'' అన్నాడు.

రామావతారానికి కోపం వచ్చింది.

''ఆనందూ!'' అన్నాడు గట్టిగా.

''చాల్లే! వూర్కో! మీరిద్దరూ ఒకే తక్కెడలో పెడితే సరిసమానంగా తూగుతారు!!'' అని తిట్టాడు ఆనందు.

మాధవి కళ్ళెర్రజేస్తూ ''అదిగో! మీరిద్దరూ నా గురించే చెప్పుకుంటున్నారు! నా మీదే నేరాలు చెప్పుకుంటున్నారు!! మీకు నేను అడ్డుగా వున్నాననీ, నన్ను చంపేద్దామనీ చూస్తున్నారు!!'' అంటూ అరవసాగింది.

ఆ గదిలో నిలువుటద్దంలోంచి మాధవి కనిపిస్తోంది!!

మరోవైపునించి రామావతారం కూడా కనిపిస్తున్నాడు ఆనందుకి.

వాళ్ళిద్దరూ బింబ, ప్రతిబింబాల్లా కనిపిస్తున్నారు!!

రామావతారం మాధవి అరుపులు వింటూ నిశ్చేష్టుడైపోయాడు.

ఆనందు తననీ, మాధవినీ కలిపి ఇద్దరిదీ ఒకటే ప్రకృతి అని అనటం గురించి ఆలోచిస్తున్నాడు.

అతడి ఒళ్ళు ఝల్లుమంది.

అతడి గుండె గుభిల్లుమంది.

అయితే, తనది కూడా మెంటల్ ప్రాబులేనా?!!

తనక్కూడా మాధవికి వచ్చినలాంటి జబ్బే వచ్చిందనా, వాడిమాట?!!

రామావతారం స్తబ్ధంగా, జడంగా వుండిపోయాడు. మాధవి ఇంకా అరుస్తూనే వున్నది!!

ఆమె అరుపు లాఇంటిలో ప్రతిధ్వనిస్తున్నాయ్ !!

''నన్ను పెళ్ళెందుకు చేస్కున్నావ్? దాన్నే చేస్కోలేకపోయావా? రోజుకోరకంగా నన్నిలా అవస్థ పెడ్తున్నావ్!! నిన్ను నమ్మకూడదు! నువ్వు దుర్మార్గుడివి! నువ్వు నా పాలిట దెయ్యానివి! భూతానివి!! నన్ను చంపేస్తావెప్పుడో?!

రామావతారానికి అప్పుడు, తను ఆ



# నీళ్ళు చాలు!

రోజూ మన శరీరం — చర్మం, ఊపిరితిత్తులు, యూరిన్, ముఖంద్వారా కనీసం పదిమండి పన్నెండు గ్లాసులనీరును బయటకు విసర్జిస్తోంది. అయితే మనం ఆహారం తీసుకొంటున్న సమయంలో నాలుగుగ్లాసుల నీరు మాత్రమే తాగుతాం! అందువల్ల మనం కనీసం మరో ఆరు నుంచి ఎనిమిది గ్లాసులదాకా ప్రతిరోజూ నీరుతాగాలి. అనేక జీవప్రక్రియలకు నీరు అవసరం! ప్రకృతి మనకు ప్రసాదించిన వరం నీరు! అందువల్ల ఇకనుంచి కాఫీ, టీలు ఎవరైనా ఇస్తానంటే... ఓ గ్లాను నీళ్ళు చాలు అని చెప్పండి!

—జూపిటర్

ఆడపెళ్ళివారి ఇంట్లో ఏవిధంగా వాగాడో గబగబా గుర్తొచ్చింది.

వాగి, వాగి మాధవి నీరసం అయిపోయిం ది.

ఆ గోడకి అలాగే వాలిపోయి నేలమీదికి కుప్పకూలిపోగా, ఆనందు ఆమెని పట్టుకొని గదిలో మంచమ్మీద పడుకోబెట్టాడు.

బయట ఎవరో పిలుస్తున్నట్టూ అయితే రామావతారం కిటికీలోంచీ బయటకు చూ సాడు.

ఆయన! ఆయనే!!

శుభలేఖ తండ్రి!!

అతని శరీరం గగుర్పాటు చెందిందప్పు డు.

ఆనందు ఆ పిలుపు విని, బయటికి వెళ్ళాడు.

ఆయన ఆనందు దగ్గరగా వెళ్ళి ''నేను ఇప్పుడే మీ దగ్గరికి వచ్చానని, మీరు అన్యధా భావించవద్దు! ఆడపిల్ల తండ్రిగా నా ఆరాట ం అటువంటిది!! మీరు మీ స్నేహితుడిని పెళ్లికి ఒప్పిస్తారని నేను ఆశ పడుతున్నాను! ఇప్పటికే పాతికేళ్ళు వచ్చాయి పిల్లకి! కాలం మనది కాదుగదా? నేనసలే గుండెజబ్బు మనిషిని! దాని పెళ్ళి చూస్తే తరువాత నా ప్రాణం పోయినా ఫరవాలేదు!! చూడండి ఆనందుగారూ!! మీ దగ్గర నేనేదీ దాచను! ఒకసారి నాకు హార్ట్ ఎటాక్ వచ్చిందండీ!! మళ్ళా వస్తే బతకనని డాక్టర్లు చెప్పేసారు!! అందువలన...'' అని చెబుతూ ఆయన ఆనందు చేతులు రెండూ పట్టుకున్నాడు.

రామావతారానికి ఆయన మాటలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి.

ఆనందు రెండడుగులు అలాగ ఆయన్ని అవతలికి తీసుకువెళ్ళి ఏదో నెమ్మదిగా చెప్పాడు!!

ఆ తరువాత— ఆయన కళ్ళు తుడుచు కోవటం, అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోవటం, కిటికీలోంచీ రామావతారం చూసాడు. ఏమిటి చెప్పేదానందు?!

ఆనందు లోనికివచ్చాడు!

రామారావతారం ఏదో అడగబోయి గొంతుకకి ఏదో అడ్డం పడినట్టే అయి ఆగిపోయాడు.

ఆనందు స్నేహితుడి దగ్గరికి వెళ్ళి అతని భుజమ్మీద చెయ్యివేసి చెప్పాడు. ''నేను శుభలేక తండ్రితో మాట్లాడాను! ఆయన గుండె జబ్బు మనిషట! ఒకసారి హార్ట్ ఎటాక్ వచ్చిందట! ఇంకోసారి వస్తే బ్రతక దని డాక్టరు చెప్పారట! కనుక కూతురిపెళ్ళి చూసి చచ్చిపోయినా ఫర్వాలేదని చెప్పాడు''.

రామావతారం ముఖ కవళికల్ని చూస్తూ ఆనందు చెప్పసాగాడు. ''కాని— నేను ఆయనకా ఛాన్స్ ఇవ్వదలచుకోలేదురా, రా మా!! ఎందుకో తెలుసా? నేను నా పెళ్ళాం వల్ల బాధ పడ్తున్నట్టూ, శుభలేఖ నీ వల్ల అవస్థ పడకూడదని!! ''నిన్ను పెళ్ళికి ఒప్పించమంటే నువ్వు ఇష్టపడలేదని గట్టిగా చెప్పేసాను'' ఆ మాటకి రామావతారం నిటారుగా అయివుండిపోయాడు.

''ఒక ఆడపిల్ల జీవితం పోవటం కంటే

ఆ ముసలాయన ప్రాణం పోవటమే మంచిదని...'' కాస్త ఆగి,

''చెప్పరా రామా!! నేను మంచి పనే చేసేనుగదూ? నా మనసుకి నేను చేసింది ఘనకార్యమే!! ఒక శుభకార్యం చెడగొట్టినా.. నాది ఘనకార్యమే!!...'' అన్నాడు ఆనందు.

ఆ గదిలో నిశ్శబ్దం బరువుగా నిలిచింది.

*

